విఘ్న వారణం- విశ్వ కారణం



ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పార్టీ నేతలను సత్కరిస్తున్న చవితి వేడుకల నిర్వాహకులు



అంబటి, బాలవజ్రబాబును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

విఘ్న నాయకుడికి మాజీ మంత్రి అంబటి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పూజలు

పట్నంబజార్: 'సమస్త వేదాలకు మూలమైన ఓంకార రూపం.. సకల దేవతా సమష్టి స్వరూపం.. సర్వ విఘ్న సంహారం.. మహా గణపతి అవతారం' అని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. అందుకే ఆయన అనాదిగా 'విఘ్న వారణం – విశ్వ కారణం' అంటూ విశ్వ జనులతో విశిష్టమైన ఆది పూజలు అందుకుంటున్నట్లు పేర్కొన్నారు. గుంటూరులో వినాయక చవితి వేడుకలు ఆదివారం కొనసాగాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాలలో అనేక రూపాలలో కొలువైన బొజ్జ గణపయ్యను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దర్శించుకున్నారు. అరండల్‌పేటలో బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి నేతృత్వంలో పరిహార్ యూత్ గణేష్ ఉత్సవ్ సర్కిల్, కొరిటపాడులో కార్పొరేటర్ యక్కల మారుతీ కోటి లింగారెడ్డి నేతృత్వంలో కొరిటపాడు యూత్, నెహ్రూనగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్, శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్, ఆర్టీసీ కాలనీలో కార్పొరేటర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శేషగిరి పవన్ కుమార్ నేతృత్వంలోని కార్మిక సంక్షేమ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్, ఆర్ అగ్రహారంలో వైఎస్సార్ సీపీ నేత టీఎల్వీ వీరాంజనేయులు ఆధ్వర్యంలో, ఏటీ అగ్రహారంలో కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, శ్రీరామ్ నగర్‌లో షేక్ రోషన్ నేతృత్వంలో స్థానికులు ఏర్పాటు చేసిన మండపాల వద్ద వినాయకుడిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వమే గణేశ తత్వమని పేర్కొన్నారు. సర్వత్రా సమంగా వ్యాపించిన ఏకీకృత చైతన్యమే ఏకదంత వినాయకుడని తెలిపారు. అందరూ సమ దృష్టిని అలవరచుకోవాలని చెప్పే సమష్టి తత్వం అదేనన్నారు. వ్యక్తిలో శక్తిని, వ్యవస్థలో స్ఫూర్తిని నింపే సద్గుణ గణాలకు అధిపతి గణపతి అన్నారు. విఘ్నాన్నే ఆయుధంగా ప్రయోగించి ఏ కార్యాన్నైనా సానుకూలం చేయగల విజ్ఞుడు విఘ్న నాయకుడని లేళ్ల అప్పిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్ వలి, గులాం రసూల్, బత్తుల దేవానంద్, పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, యర్రం కృష్ణారెడ్డి, కౌండిన్య, రేజేటి నవీన్, సుబ్బరాజు, వార్డు అధ్యక్షుడు రామదాస్, సిద్దుల శ్రీనివాసరావు, కోటి, వనజాక్షి, సీతారామిరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరం

పట్నంబజారు: ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన ఎంత అవసరమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. వినాయక చవితి నవరాత్రులలో భాగంగా ఆర్ అగ్రహారంలోని వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త వనమా బాల వజ్రబాబుతో కలసి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ వినాయక చవితి అంటేనే ఒక ప్రత్యేకత సంతరించుకుందని చెప్పారు. కుల మత ప్రాంత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఎంతో సంతోష వాతావరణంలో జరుపుకునే పండుగ విఘ్నేశ్వర చవితి అని చెప్పారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ సమితి కమిటీ సభ్యులు తిరుమల శెట్టి శివరామ కృష్ణ, తిరుమల శెట్టి సాయి, నూనె పవన్ తేజ, రాజేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన అవసరం

సీనియర్ డెంటిస్ట్ ప్రత్యూష



అవగాహన కల్పిస్తున్న సీనియర్ దంతవైద్య నిపుణురాలు కొండా ప్రత్యూష

లక్ష్మీపురం: మన శరీరానికి మంచిగా పోషకాలు అందాలంటే మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాల్సి ఉందని ఈ విషయంలో దంతాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని ప్రముఖ సీనియర్ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ కొండా ప్రత్యూష అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మన దంతాలు ఆరోగ్యంగా, బలంగా ఉంటే అన్ని రకాల ఆహార పదార్థాలు బాగా నమిలి తినే అవకాశం ఉంటుందని తద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చునన్నారు. దంతాలు సక్రమంగా లేకుంటే సరిగా నమిలి తినలేమని దీనితో జీర్ణకోశ సమస్యలు తలెత్తుతాయని, అరుగుదల సరిగ్గా అవ్వక రకరకాల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. సహజ సిద్ధంగా మనకు లభించిన దంతాలను సంరక్షించుకోవాలని ఒకవేళ ఏదో కారణం వలన దంత సమస్యలు ఏర్పడినప్పుడు కృత్రిమ దంతాలను పెట్టించుకోవటం మంచిదేనన్నారు. జ్ఞాన దంతం సాధారణంగా 40 సంవత్సరాల లోపు వారికి వస్తుందని అది వచ్చిన సందర్భాల్లో ఇబ్బంది కరంగా ఏదైనా అనిపిస్తే తొలగించవచ్చునని దాని వల్ల నష్టమేమీ ఉండదన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ ప్రత్యూషని ఘనంగా సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, రాడికల్ హ్యూమనిస్ట్ కే చంద్రశేఖర రావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఆంగ్ల మాధ్యమం విశ్వ విజేతలను చేస్తుంది

బహుభాషా బోధకురాలు అశ్విని



ఉపాధ్యాయులకు శిక్షణ కల్పిస్తున్న అశ్విని

గుంటూరు ఎడ్యుకేషన్: మాతృభాషతో పాటు అంతర్జాతీయ సంబంధాలను, విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విశ్వ విజేతలుగా గుర్తింపు పొందేందుకు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని 'మేక్ యువర్ బేబీ జీనియస్' సంస్థ డైరెక్టర్ ఎస్.అశ్విని పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో ఆదివారం ఆంగ్ల భాషా నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు ఒక్కరోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న అశ్విని మాట్లాడుతూ ఆంగ్ల భాషలో ప్రజ్ఞావంతులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తిరుపతికి చెందిన భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో రెండవ, మూడవ తరగతులు చదవుతున్న విద్యార్థులను పదో తరగతి పుస్తకాలను అలవోకగా చదివి ఆకళింపు చేసుకునేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడు భాస్కర్ రాజు మాట్లాడుతూ చిన్నతనం నుంచి 21 భాషల్లో అనర్గళంగా మాట్లాడటంతో పాటు ఎడమ, కుడి చేతులతో ఒకేసారి రాయగలిగే నైపుణ్యాలను అశ్విని సంపాదించిందని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ మాతృభాష తెలుగుతో పాటు అంతర్జాతీయస్థాయిలో వ్యవహారాలను నడిపించే భాషగా గుర్తింపు పొంది ఆంగ్లంపై అంతే స్థాయిలో విద్యార్థులు రాణించేలా శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాఘవయ్య మాస్టారు, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరితగతిన తాగునీరు సరఫరా చేయాలి

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల డిమాండ్



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం) రిజర్వాయర్‌కు తాగునీటిని సరఫరా చేసే 900 ఎంఎం డయా పైపులైన్‌కు నెహ్రూనగర్ పంపింగ్ హౌస్ వద్ద, సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పనుల వలన నగరంలో మూడు రోజుల పాటు తాగునీటి సమస్య ఉంటుందని అధికారులు చెప్పిన నేపథ్యంలో సదరు పనులను వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పరిశీలించారు.

ఇంటర్ కనెక్షన్ కలిపే జంక్షన్ పాయింట్ వద్ద రెండు పైపులను జాయింట్ చేసే పైపులకు ఒక పైపు ఒక మీటర్ కిందకు ఉండటం గమనించారు. మీటర్ ఎత్తులో ఉంటే వాటర్ ఫోర్స్ ఒకే విధంగా ఉంటుందా.. లేదా అని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు పైపులైన్ నెహ్రూనగర్ నుంచి రైల్వే గేటు కింద నుంచి చుట్టూ తిరిగి రావడం వలన పైపులైన్‌లో వాటర్ ఫోర్స్‌కి ఏమైన లీకులు అయ్యే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడుతూ రైల్వే అధికారుల సూచనల మేరకు పైపులైన్ చుట్టూ తిప్పాల్సి వచ్చిందన్నారు. దీని వలన ఎటువంటి లీకేజీ సమస్య రాదని..అల్రెడీ పంపింగ్ టెస్టింగ్ చేయడం కూడా జరిగిందన్నారు. మీటర్ ఎత్తులో ఉన్నప్పటికి మోటార్ల ద్వారా పంపింగ్ జరుగుతుండటం వలన పంపింగ్‌లో ఎటువంటి సమస్య ఉండని కార్పొరేటర్లకు అధికారులు వివరించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి నగర వాసులకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, మొహమూద్, దూపాటి వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ అబీద్, పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), వైఎస్సార్‌సీపీ నాయకులు బోడపాటి కిషోర్, మల్లవరపు రవిరాజా పాల్గొన్నారు.

మధుసూదనరావు ఆర్పీఎఫ్‌కే గర్వకారణం



మధుసూదనరావును సత్కరిస్తున్న ఆర్పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ షణ్ముగం వడివేలు

లక్ష్మీపురం: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) శాఖలో మధుసూదనరావు అందించిన సేవలు సాటిలేనివని ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ షణ్ముగం వడివేలు పేర్కొన్నారు. ఆదివారం పట్టాభిపురంలోని డి.ఆర్.ఎం. కార్యాలయంలో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ గోళ్లమూడి మధుసూదనరావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ కమిషనర్ శైలేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ పరంగా మధుసూదనరావుకు దక్కినన్ని అవార్డులు, రివార్డులు మరే అధికారికి దక్కలేదని కొనియాడారు. సేవలకు గుర్తింపుగా ఈ ఏడాది రాష్ట్రపతి పోలీస్ మెడల్ వరించిందని చెప్పారు. డెప్యూటీ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల, జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సమర్థత, విశ్వసనీయత, దక్షత ఉంటే ఏ అధికారైనా తప్పక రాణిస్తారన్నారు. డిపార్టుమెంట్‌లో మధుసూదనరావు తన శక్తి మేర పనిచేసి మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. రిటైర్డ్ అధికారి మధుసూదనరావు మాట్లాడుతూ కష్టపడితే ఏదైనా సాధించవచ్చునన్నారు. ఉద్యోగులు అందించిన సహకారం మరువలేనన్నారు. అనంతరం మధుసూదనరావు ఘనంగా సత్కరించి దంపతులను మేళతాళాలతో టాపు లేని జీపులో ఊరేగించి,వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ అధికారులు శైలేష్, పవన్ సింగ్, చెంచయ్య, మర్రి సాంబశివరావు, మురళీకృష్ణ, రవిశంకర్, చంద్రశేఖర్, దుర్గా ప్రసాద్, నారాయణ కుటుంబ సభ్యులు గోళ్లమూడి భాస్కరరావు, శ్రీనివాస్, సుశీల, బోడెపూడి అనిల్, జ్యోతి, గుమ్మడి సుబ్బారావు, భార్గవి పాల్గొన్నారు.

చరిత్రాత్మకమైన పుస్తకం ధరణికోట- నాగార్జునకొండ



ధరణికోట - నాగార్జునకొండ శిల్ప సంపద పుస్తక పరిచయ సభలో వక్తలు

నగరంపాలెం: చరిత్రాత్మకమైన పుస్తకాన్ని మనందరికి అందించారని కేంద్ర సాహిత్య అవార్డు పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. రచయిత పున్నా కృష్ణమూర్తి రచించిన అమరావతి ఆర్ట్ ధరణికోట- నాగార్జునకొండ శిల్ప సంపదల సచిత్ర వ్యాస సంకలనం పుస్తక పరిచయ సభ ఆదివారం సాయంత్రం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని భారతీయ విద్యాభవన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షత, పరిచయకర్తగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అమరావతి శిల్పాలు, విగ్రహాలు ఇతరత్రా వాటిని సేకరించి, వాటిన్నింటిని ఒకచోట ఏర్పాటుచేస్తే జ్ఞానశాల అవుతుందని అన్నారు. అమరావతి చరిత్ర అవసరం చాలా ఉందని చెప్పారు. వైభవాన్ని ప్రజల అందరికి అర్థమయ్యే లా తెలియజేయాలని కోరారు. పుస్తక రచయిత పున్నా కృష్ణమూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ మ్యూజియంలో వేలాది యాత్రికులు అమరావతి శిల్ప సౌందర్యాన్ని తిలకించి, ఆనందాశ్చర్యలకు గురవుతున్నారని అన్నారు. ఆ సంపద బయటకు వెళ్లిపోయిందనే వేదన వ్యక్తిగతంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో అమరావతి ప్రాచీన చరిత్ర, వాటి శిల్పకళను పుస్తకంలో రచించినట్లు తెలిపారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ అమరావతి అంటే ఊరు కాదని, ఏపీ కల్చరల్ అని అన్నారు. అమరావతికి 225 ఏళ్ల వయసు అని, ధరణికోటకు రెండు వేల వయసు అని చెప్పారు. ఈ పుస్తకంతో అమరావతి శిల్పాల గౌరవం చాటారని పేర్కొన్నారు. పుస్తకం చదివాక మంచి, గౌరవమైన పుస్తకమని అన్నారు. సభకు కొరివి వినయకుమార్ అధ్యక్షత వహించగా, పరిచయ కర్త ధనేకుల శైలజా, సింగారావు, విజయ కుమార్, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆదేశాలు వెనక్కి తీసుకోండి

నెహ్రూ నగర్: సచివాలయ ఉద్యోగులు ఇంటి ఇంటికి వెళ్లి రేషన్ సరఫరా చేయాలని రాష్ట్రంలోని అనేక చోట్ల రెవెన్యూ అధికారులు ఇస్తున్న ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ–వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉన్నత విద్యావంతుల భవిష్యత్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయాలనుకుంటుందో చెప్పాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అంటే విలువ లేకుండా చేస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు.

వైభవంగా వినాయక వ్రతాలు



వినాయక వ్రతాలు చేస్తున్న మైలవరపు శ్రీనివాసరావు



భక్తులకు అన్నప్రసాద వితరణ

నగరంపాలెం: స్థానిక ఏటుకూరురోడ్డు శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద 27వ గణేష్ చతుర్థి నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. వాసవి యూత్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆదివారం ఉదయం బ్రహ్మశ్రీ డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావుచే వినాయక వ్రతాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం వేళలో పుష్ప గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి సన్మానం

తెనాలి టౌన్: గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సంస్కృతిక సౌజన్యంతో తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో ఆగస్టు 29, 30, 31 తేదీల్లో నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన తెలుగు భాషా ఉత్సవాలలో తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారికి గౌరవం దక్కింది. ఈ ఉత్సవాల్లో ప్రజ్ఞాచారి పాల్గొని 'లలితా విభూషిత తెలుగు పదము' అను శీర్షికతో పద్య పఠనం చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, విశ్రాంత ఉప కులపతి, కొలకలూరి ఇనాక్ విచ్చేసి ప్రజ్ఞాచారి పద్య పఠానాన్ని విని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞాచారి మాట్లాడారు. నేటి కాలంలో తెలుగు ఉన్నత స్థితిని ప్రస్తావిస్తూ 'తెలుగు విలపం' అనే పద్యకావ్యం రాసినట్లు పేర్కొన్నారు. దీని వల్ల తెలుగు భాషోత్సవాల్లో కొలకలూరి ఇనాక్ వంటి మహనీయుల చేత సత్కారం లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863–2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

వాషింగ్ ప్లాట్‌ఫామ్‌కు శంకుస్థాపన



దుగ్గిరాల: చేతిపంపుల స్థానంలో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణం కోసం భూమి పూజ చేయడం జరిగిందని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ అన్నారు. ఆదివారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న చేతి పంపుల స్థానంలో నూతనంగా రూ.1.60 లక్షల వ్యయంతో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మిస్తున్నామని, దీంతో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.శోభాదేవి, దోస్త్ కమిటీ సభ్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యవర్గ సభ్యులు, గూడూరు వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోరంపూడి గ్రైటనాల్టిస్

గ్రైటనాల్టిస్ డైరెక్టర్ వంగర హేమ చందు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోరంపూడిలో ఉన్న గ్రైటనాల్టిస్ లెప్రసీ ఆసుపత్రికి రోగుల అవసరాల నిమిత్తం పరుపులు, దిండ్లను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, సిబ్బంది ఆదివారం అందించారు.

మెరుగైన పరిపాలన అందించడమే లక్ష్యం

మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి టౌన్: ప్రజలకు మెరుగైన సేవలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం, పినపాడు గ్రామాల్లో ఆదివారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహ పాల్గొని రేషన్ లబ్ధిదారులకు నూతన స్మార్ట్ కార్డులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే లబ్ధిదారుల వివరాలు వెంటనే తెలుస్తాయని అన్నారు. గతంలో కంటే మెరుగైన సులభతరమైన సేవలు ఈ కార్డుతో అందుతాయని తెలిపారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, డీలర్లు ఇంటింటికీ వచ్చి కొత్త కార్డులు ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో కఠెవరం సర్పంచి బండికళ్ల ప్రసాద్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఆర్ఐ జాన్, సీడీపీవో విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన రేపు

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశంలో మంగళవారం గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీవీసీ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ వై.రామ్‌కిషోర్ కార్యక్రమంలో పాల్గొని 'గుండెపోటుకు కారణాలు.. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అంశంపై ప్రసంగించనున్నారు.

నిడమర్రులో చోరీ

నిడమర్రు(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రులో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కురంగేశ్వరరావు కుటుంబసభ్యులతో సహా ఆగస్టు 24వ తేదీన తిరుపతి వెళ్లారు. 26వ తేదీ తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.4 లక్షల విలువైన 30 గ్రాముల బంగారం, పలు వెండి వస్తువులు, రూ.45 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు శనివారం రాత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన దుండగులు చుట్టు పక్కల వారు కేకలు వేయడంతో తమ ద్విచక్ర వాహనం వదిలి పారిపోయారని, వాహనం నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



పట్నంబజారు: నగరంలోని రైలు పేటలో రైలు పేట ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబోదరునికి కమిటీ నిర్వాహకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దానిలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జి.హేమంత్, ఎస్.ప్రమీల, జి.సాయిరాం, జి.క్రాంతి రాజేశ్వరి, జి.అనూరాధ పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలో మంత్రివారి వీధిలోని అయ్యప్ప రెసిడెన్సీలో ఏర్పాటు చేసి మట్టి గణపతి విగ్రహ నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులైన తాతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు, హోమం నిర్వహించి సంగడిగుంట వీధుల్లో చెక్క భజనలు, మహిళల కోలాటాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలంలో పెద్ద లడ్డూ అప్పల శ్రీరాములు, చిన్న లడ్డూ వాగ్దేవి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు, మద్ది రవి కుమార్, అనిల్, శేఖర్, కిషోర్, రామాంజనేయులు పాల్గొన్నారు

ఎన్టీఆర్ విగ్రహ ఊరేగింపును అడ్డుకున్న పోలీసులు

ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎన్టీఆర్ అభిమానులు



కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్.టి.ఆర్ విగ్రహం ఊరేగింపును అడ్డుకుంటున్న పోలీసులు

లక్ష్మీపురం: వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో కృష్ణుడి రూపంతో ఉన్న దివంగత ఎన్టీఆర్ విగ్రహ ఊరేగింపును పోలీసులు అడ్డుకున్న ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. వినాయక చవితిని పురస్కరించుకుని వికాస్‌నగర్ 1వ లైన్ ప్రాంతంలో మండపాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనం చేసే క్రమంలో వికాస్‌నగర్, జేకేసీ కళాశాల మీదుగా గుజ్జనగుండ్ల సెంటర్, పాలిటెక్నిక్ కళాశాల మీదుగా బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డు మీదుగా వినాయకుడి విగ్రహంతో పాటుగా దివంగత ఎన్టీఆర్ వీరాభిమాని సుమారు రూ.2 లక్షలతో కృష్ణభగవానుడి రూపంలో ఉన్న విగ్రహాన్ని పూలతో, విద్యుత్ అలంకరణతో అలంకరించి ఊరేగింపులో ఏర్పాటు చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని స్పెన్సార్ వద్దకు వచ్చేసరికి భారీ సంఖ్యలో గుంటూరు నగర పోలీసులు చేరుకుని కృష్ణుడి రూపంలో ఉన్న విగ్రహం ఊరేగింపు అడ్డుకున్నారు. దీంతో ఒక్కసారిగా టీడీపీ శ్రేణులు, దివంగత ఎన్టీఆర్ అభిమానులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకు వెళ్లేందుకు మాత్రమే అనుమతి ఉందని, కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఊరేగించేందుకు అనుమతులు లేవని ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిలిపి వేయాల్సిందిగా పోలీసులు కోరారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని బృందావన్ గార్డెన్స్‌లో ఒక్క నిమిషం కూడా ఆపకుండా వెనక్కి పంపించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.